కేరళ స్కూల్‌లో ఏఐ టీచర్

తిరువనంతపురం: అనేక రంగాల్ని ప్రభావితం చేస్తున్న 'ఏఐ' (కృత్రిమ మేధ) సాంకేతిక పరిజ్ఞానం.. విద్యారంగంలోనూ అడుగుపెట్టింది. దేశంలోనే మొదటి జెనరేటివ్ ఏఐ టీచర్‌ను కేరళలోని ఓ స్కూల్ తమ విద్యార్థుల కోసం తీసుకొచ్చింది. తిరువనంతపురం కేటీసీటీ ఉన్నత పాఠశాలలో హ్యూమనాయిడ్ ఏఐ టీచర్ 'ఐరిస్'ను ఆవిష్కరించారు. రోబోటిక్స్, జెనరేటివ్ టెక్నాలజీని ఉపయోగించి 'మేకర్‌ల్యాబ్స్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ దీనిని అభివృద్ధి చేసింది. సాంప్రదాయ టీచింగ్ పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులను ఇది తీసుకొస్తుందని సంస్థ తెలిపింది. విద్యార్థులతో 'ఐరిస్' మూడు భాషల్లో మాట్లాడుతుందని, సంక్లిష్టమైన అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పగలదని పేర్కొన్నది. ఇంటెల్ ప్రాసెసర్ కలిగిన 'ఐరిస్'లో వాయిస్ అసిస్టెంట్, ఇంటరాక్టివ్ లెర్నింగ్ మాడ్యూల్స్, మొబిలిటీ.. మొదలైన ఆప్షన్లు ఉన్నట్టు సంస్థ తెలిపింది.

217 సార్లు కరోనా టీకా వేసుకున్నాడు!

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ఓ వ్యక్తి ఏకంగా 217 సార్లు కరోనా టీకా వేసుకున్నాడు. అయినా, అతడి రోగ నిరోధక వ్యవస్థ ఎలాంటి ఇబ్బందులకు గురికాకపోవటం గమనార్హం. వ్యాక్సిన్లు అధికంగా వేసుకుంటే రోగ నిరోధక వ్యవస్థలోని కణాలు తమ శక్తిని కోల్పోతాయని శాస్త్రవేత్తలు భావిస్తూ వచ్చారు. ఫ్రెడ్రిచ్-అలెగ్జాండర్ యూనివర్సిటీ పరిశోధకులు అతడి రోగ నిరోధక కణాలను క్షుణ్ణంగా పరిశీలించగా, అవి ఎలాంటి ప్రభావానికి గురికాలేదని తేలింది. వ్యక్తిగత కారణాల వల్లే ఆ వ్యక్తి అన్ని సార్లు కరోనా టీకాలు వేసుకున్నట్టు అధికారులు చెప్పారు.

గంట అంతరాయం.. 25 వేల కోట్లు నష్టం

న్యూఢిల్లీ: మెటా సీఈవో జుకర్‌బర్గ్ మంగళవారం ఒక్క గంటలో 3 బిలియన్ల డాలర్లు (సుమారు రూ.25 వేల కోట్లు) నష్టపోయారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సర్వీసులు మంగళవారం గంట పాటు పనిచేయలేదు. సాంకేతిక లోపం వల్ల సమస్య ఉత్పన్నమైంది. దీంతో మెటా షేర్లు క్షీణించాయి. బ్లూమ్‌బర్గ్ ఇండెక్స్‌లో జుకర్‌బర్గ్ సంపద సుమారు 3 బిలియన్లు తగ్గి 176 బిలియన్లకు పడిపోయింది. అయినప్పటికీ కుబేరుల్లో అతను నాల్గో స్థానంలో కొనసాగుతున్నాడు. మంగళవారం మెటా షేర్లు 1.6 శాతం క్షీణించాయి. ఫలితంగా జుకర్‌బర్గ్ నికర విలువకు కోత పడింది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో హైదరాబాదీ మృతి

ఏజెంట్ల చేతిలో మోసపోయిన బాధితుడు

- హెల్పర్ ఉద్యోగం పేరుతో బలవంతంగా రష్యా సైన్యంలోకి
- రెండు దేశాల సరిహద్దుల్లో ఉక్రెయిన్ సైనికులతో యుద్ధం
- బాధితులుగా 20 మంది?

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ)/న్యూఢిల్లీ: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో హైదరాబాద్‌లోని బజార్‌ఘాట్‌కు చెందిన మహ్మద్ అస్ఫాన్(30) మరణించాడు. ఉద్యోగం పేరుతో ఏజెంట్ల చేతిలో మోసానికి గురైన అతను రష్యా సైన్యంలో బలవంతంగా చేరాల్సి వచ్చినట్టు తెలుస్తున్నది. మహ్మద్ అస్ఫాన్ యుద్ధంలో చనిపోయిన విషయాన్ని అధికారులు బుధవారం ధ్రువీకరించారు. రష్యా నుంచి తన కుమారుడిని తిరిగి రప్పించేందుకు సాయం చేయాలని అస్ఫాన్ కుటుంబసభ్యులు ఇటీవల ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కోరారు. దీంతో ఆయన మాస్కోలోని భారత రాయబార కార్యాలయ అధికారులను సంప్రదించగా.. అస్ఫాన్ మరణించినట్టు అక్కడి అధికారులు తాజాగా వెల్లడించారు.

ఉద్యోగం అంటూ మోసం

అస్ఫాన్ హైదరాబాద్‌లో బట్టల దుకాణంలో పనిచేసేవాడు. విదేశాల్లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న అతనికి ఒక ఏజెంట్ పరిచయమయ్యాడు. రష్యా రాజధాని మాస్కోలో ఉద్యోగాలున్నాయంటూ నమ్మించాడు. అస్ఫాన్ గత ఏడాది డిసెంబర్‌లో రష్యాకు వెళ్లాడు. అక్కడ రష్యా ఆర్మీకి హెల్పర్‌గా పనిచేయాలని సూచించారు. ఈ క్రమంలోనే అస్ఫాన్ రష్యా తరపున యుద్ధంలోకి వెళ్లాల్సి రావడంతో, అక్కడి జరిగిన కాల్పుల్లో మృతి చెందాడు. మహ్మద్ అస్ఫాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అస్ఫాన్ మృతదేహాన్ని భారత్‌కు పంపేందుకు సంప్రదింపులు చేస్తున్నట్టు మాస్కోలోని భారత ఎంబసీ పేర్కొన్నది.

ఇటీవల గుజరాత్ యువకుడి మరణం

ప్రస్తుతం రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధంలో రష్యా ఆర్మీ హెల్పర్‌గా నియమితులైన గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన హమిల్ మంగుకియా అనే 23 ఏండ్ల యువకుడు కూడా కొన్ని వారాల క్రితం మరణించాడు. హమిల్ ఒక ఆన్‌లైన్ ప్రకటన ద్వారా రష్యాలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకొన్నాడు. ఏజెంట్ల సమాచారం మేరకు ఆ తర్వాత అతను చెన్నై మీదుగా మాస్కో చేరుకొన్నాడు. అనంతరం అతన్ని రష్యా ఆర్మీలో సహాయకుడిగా నియమించారు.

బలవంతంగా యుద్ధంలోకి

సెక్యూరిటీ హెల్పర్‌గా నియమించుకొన్న వారిని సరిహద్దుల్లో ఉక్రెయిన్ సైనికులతో బలవంతంగా యుద్ధంలోకి దించుతున్నారని మీడియా నివేదికలు చెబుతున్నాయి. దీనిపై గత వారం స్పందించిన భారత విదేశాంగ శాఖ.. వీలైనంత త్వరగా బాధితులను దేశానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నది. రష్యా ఆర్మీకి సహాయకులుగా పనిచేసేందుకు 20 మంది వరకూ భారతీయులు వెళ్లినట్టు సమాచారం ఉన్నదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు.

బాధితులను దేశానికి తిరిగి తీసుకురావాలి: కేటీఆర్

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో హైదరాబాదీ యువకుడి మృతిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ విషాద ఘటనపై విచారం వ్యక్తం చేసిన ఆయన.. బాధిత కుటుంసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉద్యోగాల కోసం వెళ్లి మోసపోయి, చిక్కుకుపోయిన యువకులను తిరిగి భారత్ తీసుకొచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

కేజ్రీవాల్‌పై మళ్లీ కోర్టుకు ఈడీ ఫిర్యాదు

సమన్ల తిరస్కరణపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మార్చి 6: మద్యం పాలసీ కేసులో విచారణకు రావాలంటూ తాము పదేపదే సమన్లు పంపినా వాటిని తిరస్కరిస్తున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై చర్య తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం ఢిల్లీ కోర్టులో తాజాగా మరో పిటిషన్ దాఖలు చేసింది. ఇప్పటికే 8 సార్లు సమన్లు పంపినా వాటిని లెక్కచేయలేదని ఆరోపిస్తూ ఐపీసీ 174 సెక్షన్ కింద తాజా పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసును ఈ నెల 16న విచారించనున్నట్టు కోర్టు తెలిపింది. అయితే మార్చి 12 తర్వాత వర్చువల్‌గా తాను విచారణకు హాజరు అవుతానని కేజ్రీవాల్ ఇదివరకే తెలిపారు.

ఒడిశాలో బీజేడీ-బీజేపీ పొత్తు?

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఒడిశాలోని అధికార బీజేడీ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుంటుందనే ప్రచారం జరుగుతున్నది. ప్రధాని మోదీ మంగళవారం రాష్ట్రంలో రూ.19,600 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్ తండ్రి బిజూ పట్నాయక్ జయంతి సందర్భంగా ఆయనకు ప్రధాని మోదీ నివాళులర్పించారు. మరోవైపు దేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారంటూ నవీన్ పట్నాయక్ ప్రశంసలు కురిపించారు.

రాయ్‌బరేలి నుంచి ప్రియాంక పోటీ?

న్యూఢిల్లీ: యూపీలోని రాయ్‌బరేలి నుంచి కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ పోటీచేస్తారని జోరుగా ప్రచారం సాగుతున్నది. ఈ స్థానం నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న సోనియా గాంధీ ఇటీవల రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన విషయం తెలిసిందే. మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మళ్లీ అమేథీ నుంచి పోటీ చేయనున్నట్టు సమాచారం. అలాగే ప్రస్తుతం ఆయన ఎంపీగా ఉన్న కేరళలోని వయనాడ్ నుంచి కూడా ఆయన రెండో స్థానంగా పోటీచేయనున్నట్టు తెలుస్తున్నది.

మళ్లీ ట్రంప్ వర్సెస్ బైడెన్

రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసు నుంచి తప్పుకున్న నిక్కీ హేలీ



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో మరోసారి జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ తలపడబోతున్నారు. 15 రాష్ట్రాల్లో మంగళవారం సూపర్ ట్యూస్‌డే ప్రైమరీ ఎన్నికలు జరగగా, అన్ని రాష్ట్రాల్లోనూ ఓడిపోవడంతో ఇండియన్-అమెరికన్ నిక్కీ హేలీ తన ప్రచారాన్ని నిలిపేశారు. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసు నుంచి తప్పుకున్నారు. నిక్కీ హేలీ సౌత్ కరోలినాలో మాట్లాడుతూ, 'నా ప్రెసిడెన్షియల్ క్యాంపెయిన్‌ను నిలిపేయవలసిన సమయం వచ్చింది' అన్నారు. అమెరికన్లు తమ గళాలను వినిపించాలని తాను కోరుకుంటున్నానని చెప్పానని, అదే చేశానని చెప్పారు. తనకు విచారం లేదన్నారు. తాను అభ్యర్థిని కాకపోయినప్పటికీ, తాను నమ్మిన విషయాల కోసం గళమెత్తడాన్ని ఆపబోనని స్పష్టం చేశారు. అయితే ఆమె ఈ క్యాంపెయిన్‌లో చరిత్ర సృష్టించారు. రిపబ్లికన్ ప్రెసిడెన్షియల్ ప్రైమరీని గెలుచుకున్న తొలి మహిళగా, ఓ డెమొక్రాటిక్ లేదా రిపబ్లికన్ ప్రైమరీలో విజయం సొంతం చేసుకున్న తొలి ఇండియన్-అమెరికన్‌గా ఘనత సాధించారు.

రైతన్నల చలో ఢిల్లీ

ఢిల్లీ సరిహద్దుల్లో ట్రాఫిక్‌జామ్

న్యూఢిల్లీ, మార్చి 6: కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతోపాటు పలు ఇతర డిమాండ్ల సాధన కోసం రైతన్నలు బుధవారం చలో ఢిల్లీ మార్చ్ చేపట్టారు. దీంతో రైతులను ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. పదుల సంఖ్యలో రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) తెలిపింది. రైతుల మార్చ్ నేపథ్యంలో ఢిల్లీ సరిహద్దుల్లో భారీగా బలగాలను మోహరించారు. పెద్ద ఎత్తున బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ఢిల్లీ-హర్యానా సింఘు సరిహద్దు, ఢిల్లీ-నోయిడా సరిహద్దుల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. తమ ఆందోళన ఇప్పుడు దేశవ్యాప్తమైందని రైతు నాయకుడు సర్వన్‌సింగ్ పంధేర్ తెలిపారు. రాజస్థాన్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన సుమారు వంద మంది రైతులను మార్గమధ్యలో నిర్బంధించారని ఆయన చెప్పారు. కానీ ప్రభుత్వం మాత్రం రైతుల ఆందోళన పంజాబ్ వరకే పరిమితమని చెబుతున్నదని పంధేర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న శంభు, ఖానౌరీ సరిహద్దు వద్ద కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇందులో మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని పంధేర్ తెలిపారు. తమ ఆందోళనకు హర్యానాలోని ఖాప్ పంచాయితీలు కూడా మద్దతు తెలిపాయని వెల్లడించారు.

'హనుమాన్' వచ్చేస్తున్నది!

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత చాట్‌జీపీటీకి పోటీగా దేశీయంగా అభివృద్ధి చేసిన భారత్‌జీపీటీ 'హనుమాన్' త్వరలో అందుబాటులోకి రానున్నది. భారత్ జీపీటీ గ్రూపు ఏఐ మాడల్ హనుమాన్‌ను లాంచ్ చేసేందుకు సిద్ధమవుతున్నది. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్, దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది ఐఐటీల నేతృత్వంలోని కన్సార్టియం 'హనుమాన్'ను అభివృద్ధి చేసింది. ప్రస్తుతం ప్రపంచాన్ని ఊపేస్తున్న చాట్‌జీపీటీ లాంటి సేవలను ఇది కూడా అందించనున్నది. ఈ లాంగ్వేజ్ మాడల్ తెలుగు, హిందీ, తమిళం సహా 11 దేశీయ భాషల్లో సేవలందిస్తుంది.

5 గంటల కన్నా తక్కువ నిద్రిస్తే డయాబెటిస్ ముప్పు

న్యూఢిల్లీ: మనిషి ఆరోగ్యానికి నిద్ర చాలా అవసరం. నిద్రలేమి వల్ల తలెత్తే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. రోజూ 3 నుంచి 5 గంటలపాటు మాత్రమే నిద్రపోయేవారికి టైప్-2 డయాబెటిస్ ముప్పు అధికంగా ఉంటుందని, దీర్ఘకాలిక నిద్రలేమిని కేవలం పండ్లు, కాయగూరల్లాంటి ఆరోగ్యకరమైన ఆహారంతో భర్తీ చేయలేమని స్వీడన్‌లోని ఉప్సల యూనివర్సిటీ పరిశోధకుల బృందం తమ అధ్యయనంలో తేల్చింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రోజూ కంటి నిండా నిద్రపోవడం అందరికీ సాధ్యం కాదని తెలుసని, అయినప్పటికీ నిద్రకు తగిన ప్రాధాన్యమివ్వాల్సిందేనని పరిశోధకులు తెలిపారు.

శ్వాసతో షుగర్ టెస్ట్

న్యూఢిల్లీ: ప్రస్తుతం చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ డయాబెటిస్ బారిన పడుతున్నారు. అయితే షుగర్ స్థాయిలను గుర్తించాలంటే సిరంజి ద్వారా రక్తం తీసి.. గ్లూకోమీటర్‌తో పరీక్షించాల్సిందే. రక్తాన్ని సేకరించే అవసరం లేకుండా, కేవలం శ్వాసతో చక్కెర స్థాయిలను తెలిపే పరికరాన్ని హిమాచల్ ప్రదేశ్‌లోని ఐఐటీ-మండీ శాస్త్రవేత్తలు తయారుచేశారు. మొదటగా వీరు తయారుచేసిన పరికరంలో మనం శ్వాసను ఊదాలి. ఇలా ఊదిన శ్వాస నమూనాలను బెలూన్స్‌లో నింపుతారు. ఆ తర్వాత పరికరం షుగర్ స్థాయితోపాటు, రక్తంలో ఆక్సిజన్ స్థాయి, బీపీ.. వివరాలను కూడా అందజేస్తుందని పరిశోధకులు చెప్పారు.

రోబోలతో ఫుడ్ డెలివరీ

జపాన్‌లో ప్రవేశపెట్టిన ఉబర్ ఈట్స్

టోక్యో, మార్చి 6: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ ఉబర్ ఈట్స్ జపాన్‌లో ఫుడ్ డెలివరీ కోసం రోబోలను రంగంలోకి దించింది. డెలివరీ బాయ్స్‌కు బదులుగా రోబోల ద్వారా ఫుడ్ డెలివరీ చేసే సర్వీసులను బుధవారం ప్రారంభించింది. దేశం ఎదుర్కొంటున్న కార్మికుల కొరత సమస్యను ఇది తీరుస్తుందని పేర్కొన్నది. ప్రస్తుతం ఈ రోబోల సేవలను టోక్యోలోని రెండు స్టోర్లకు మాత్రమే పరిమితం చేశామని, భవిష్యత్తులో వీటిని మరిన్ని స్టోర్లకు విస్తరిస్తామని నిర్వాహకులు తెలిపారు. కెమెరాల ద్వారా ట్రాఫిక్‌ను తప్పించుకుంటూ గంటకు 6 కిలోమీటర్ల వేగంతో ఇవి ప్రయాణిస్తాయి. 27 లీటర్ల పానీయాలు, 27 కేజీల ఆహారాన్ని ఏకకాలంలో తీసుకుపోగల సామర్థ్యం వీటి సొంతం.

చంద్రుడిపై అణు విద్యుత్తు ప్లాంట్

రష్యా, చైనా సంయుక్త ప్రాజెక్ట్

మాస్కో, మార్చి 6: భవిష్యత్తులో చంద్రుడిపై ఆవాసం ఏర్పరుచుకుంటే.. అక్కడ ఇంధన సమస్యలు రాకూడదన్న ఆలోచనతో రష్యా, చైనాలు సంయుక్తంగా ఓ ప్రాజెక్ట్‌ను చేపట్టాయి. 2035 నాటికల్లా చంద్రుడిపై అణు విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మించేందుకు సిద్ధమవుతున్నాయి. చంద్రుడిపై అన్వేషణ, నివాసాన్ని ఏర్పాటుచేయాలన్న పరిశోధనలో ఇరు దేశాలు ఒకదానికొకటి సహకరించుకోనున్నాయి. ఉపగ్రహంపై విద్యుత్తు డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు ఈ ప్రాజెక్ట్ దోహదపడుతుందని రష్యా స్పేస్ ఏజెన్సీ 'రోస్‌కాస్మోస్' చీఫ్ యూరి బోరిసోవ్ తెలిపారు.

రెండు దశల్లో చంద్రయాన్-4

న్యూఢిల్లీ, మార్చి 6: చంద్రయాన్-3 చారిత్రాత్మక విజయం సాధించాక చంద్రయాన్-4 పేరుతో మరో మిషన్‌కు ఇస్రో సిద్ధమైంది. ఈ ప్రయోగం రెండు దశల్లో ఉంటుందని, ఇందుకోసం రెండు వాహక నౌకలను సిద్ధం చేస్తున్నట్టు ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఇటీవల జరిగిన నేషనల్ సైన్స్ సింపోజియం కార్యక్రమంలో మాట్లాడుతూ తెలిపారు. చంద్రునిపై నుంచి రాళ్లు, మట్టి నమూనాలను తీసుకురావటం లక్ష్యంగా పెట్టుకున్నట్టు గతంలోనే చెప్పారు. చంద్రయాన్ -4లో ప్రొపల్షన్, డిసెండర్, అసెండర్, ట్రాన్స్ఫర్, రీ ఎంట్రీ అనే ఐదు రకాల మాడ్యూల్స్ ఉంటాయన్నారు.

నదీ గర్భ మెట్రో లైన్

దేశంలోనే మొదటి అండర్ వాటర్ మెట్రో రైలు టన్నెల్

కోల్‌కతాలో ప్రారంభించిన ప్రధాని మోదీ

కోల్‌కతా, మార్చి 6: దేశంలోనే మొట్టమొదటి నదీ గర్భ మెట్రో మార్గాన్ని ప్రధాని మోదీ బుధవారం పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ప్రారంభించారు. కోల్‌కతా ఈస్ట్-వెస్ట్ మెట్రో కారిడార్‌లో భాగంగా ఈ 4.8 కిలోమీటర్ల ఎస్‌ప్లనడే-హౌరా మైదాన్ సెక్షన్‌ను నిర్మించారు. ఇందులో భాగమైన 520 మీటర్ల అండర్ వాటర్ మైట్రో లైన్ హుగ్లీ నది కింద నుంచి వెళ్తుంది. నదీ గర్భ మెట్రో మార్గాన్ని ప్రారంభించిన తర్వాత ప్రధాని మోదీ ఎస్‌ప్లనడే నుంచి హౌరా మైదాన్ వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. ఆ తర్వాత అదే రూట్‌లో తిరిగి ఎస్‌ప్లనడేకి వచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాని వెంట రాష్ట్ర బీజేపీ నేత సువేందు అధికారి ఉండగా.. రాష్ట్ర సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ హాజరు కాలేదు. నదీ గర్భ మెట్రో లైన్‌తో పాటు మోదీ రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు.

అండర్ వాటర్ మెట్రో విశేషాలు

- హౌరా మైదాన్-ఎస్‌ప్లనడే సెక్షన్ దేశంలోనే నది కింద నిర్మితమైన తొలి టన్నెల్.
- నీటి ఉపరితలానికి 16 మీటర్ల దిగువన మెట్రో సర్వీసులు నడుస్తాయి.
- హౌరా మెట్రో స్టేషన్ దేశంలోనే అత్యంత లోతైన మెట్రో స్టేషన్. ఇది భూ ఉపరితలానికి 32 మీటర్ల లోతులో ఉంటుంది.
- కోల్‌కతా ఈస్ట్-వెస్ట్ మెట్రో కారిడార్ మార్గం పొడవు 16.6 కిలోమీటర్లు కాగా.. 10.8 కిలోమీటర్లు భూగర్భంలో ఉంటుంది.
- ఇందులో 4.8 కిలోమీటర్లు ఉండే ఎస్‌ప్లనడే - హౌరా మైదాన్ సెక్షన్‌ను రూ.4,960 కోట్లతో నిర్మించారు.
- ఈ లైన్‌లో భాగంగా 520 మీటర్ల పొడవైన హుగ్లీ నది దిగువ మార్గాన్ని 45 సెకన్లలో దాటడం ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది.
- లండన్-ప్యారిస్ కారిడార్‌లోని యూరోస్టార్ సర్వీస్ మాదిరిగా ఈ మెట్రో టన్నెల్ నిర్మించారు.
- దేశంలోనే తొలిసారిగా 1984లో మెట్రో రైల్ సేవలు ప్రారంభమైన కోల్‌కతాలోనే మొదటి అండర్ వాటర్ మెట్రో సేవలు ప్రారంభం కావడం విశేషం.

సీబీఐ కస్టడీకి షాజహాన్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో జనవరి 5న ఈడీ అధికారులపై జరిగిన దాడి కేసులో అరెస్టైన ప్రధాన నిందితుడు, తృణమూల్ బహిష్కృత నేత షాజహాన్ షేక్‌ను సీబీఐ అధికారులు బుధవారం సాయంత్రం ఎట్టకేలకు అదుపులోకి తీసుకొన్నారు. దీంతో బెంగాల్ ప్రభుత్వానికి, సీబీఐ అధికారులకు మధ్య రెండురోజులుగా జరుగుతున్న హైడ్రామాకు తెరపడినట్లయింది. సందేశ్‌ఖాలీ దర్యాప్తును బెంగాల్ పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేయాలని, నిందితుడు షాజహాన్‌ను సీబీఐ కస్టడీకి ఇవ్వాలని మంగళవారం కలకత్తా హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ, నిందితుడిని అప్పగించడంలో తొలుత తాత్సారం చేసిన బెంగాల్ సర్కారు.. ఎట్టకేలకు బుధవారం సాయంత్రం 6.48 గంటలకు షాజహాన్‌ను సీబీఐ కస్టడీకి అప్పగించింది.



ఎంతో ఎత్తయిన గోడను పాకుతున్న ఈ సాహసికులు ఏదో ఘనకార్యం చేస్తున్నారనుకుంటే పొరపాటు.. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న తమ పిల్లలకు కిటికీల్లోంచి చిట్టీలను వేసేందుకు వీరంతా ఇలా గోడను ఎగబాకుతున్నారు. హర్యానా నూహ్ జిల్లా తౌరులోని చంద్రావతి పాఠశాల దగ్గర కనిపించింది దృశ్యం. పరీక్ష ప్రారంభమైన కొంతసేపటికే పేపర్ లీకైనట్టు సమాచారం.

'ఐఎన్ఎస్ జటాయు' ప్రారంభం

మినీకాయ్ (లక్షద్వీప్), మార్చి 6: వ్యూహాత్మక నౌకా స్థావరమైన ఐఎన్ జటాయును లక్షద్వీప్ దీవుల్లోని మినీకాయ్ ద్వీపంలో భారత ప్రభుత్వం బుధవారం ప్రారంభించింది. పశ్చిమ అరేబియా సముద్రంలో యాంటీ పైరసీ, యాంటీ నార్కోటిక్స్ కార్యకలాపాల నియంత్రణలో ఈ నౌకాస్థావరం దేశ నావికాదళానికి సహాయ పడుతుంది. నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్ హరికుమార్ ఈ కొత్త స్థావరాన్ని ప్రారంభించారు.

నేవీ అమ్ములపాదిలోకి సీహాక్

న్యూఢిల్లీ: భారత నేవీ అమ్ములపాదిలోకి కొత్త అస్త్రం చేరింది. ఎంహెచ్60ఆర్ సీహాక్ మోడల్ హెలికాప్టర్లను అమెరికా నుంచి దిగుమతి చేసుకున్నది. కేరళలోని కొచ్చిలో జరిగిన ఓ కార్యక్రమంలో వీటిని ప్రారంభించారు. శత్రుస్థావరంపై దాడి చేసి సురక్షితంగా తిరిగి రావటం సీహాక్ ప్రత్యేకత. యుద్ధనౌకలపై దాడి చేయటమే కాకుండా రెస్క్యూ ఆపరేషన్, సిబ్బంది రవాణా, వైద్య సామాగ్రి తరలింపు తదితర సేవలన్నీ ఇవి అందిస్తాయి.

బోళ్లు కడగొద్దు.. స్నానం చేయొద్దు

డిస్పోజబుల్ ప్లేట్లలో తినండి..వైప్స్‌తో ముఖం తుడుచుకోండి!

- బెంగళూరులో తీవ్ర నీటి ఎద్దడి
- వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ల సూచన
- నీటికి రక్షణగా సెక్యూరిటీ సిబ్బంది
- కాంగ్రెస్ పార్టీ పాలిత కర్ణాటకలో ఇదీ పరిస్థితి

'ఒక వ్యక్తికి ఒక వాటర్ క్యాన్ మాత్రమే' అంటూ బెంగళూరులో ఆర్వో వాటర్ ప్లాంట్ వద్ద వెలిసిన పోస్టర్

బెంగళూరు, మార్చి 6: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో పూర్తిగా ఎండాకాలం రాకముందే ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. ప్రధానంగా రాజధాని బెంగళూరు నగరంలో తీవ్రమైన నీటి సంక్షోభం నెలకొన్నది. ఈ నేపథ్యంలో నగరంలోని పలు హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్లు తమ ప్రాంతాల్లో నీటి రేషనింగ్‌ను ప్రారంభించాయి. అదేవిధంగా నీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో తమ వాహనాలను నీటితో కడుగడంతో పాటు స్విమ్మింగ్ పూల్ కార్యకలాపాలపై కూడా సొసైటీలు నిషేధం విధించాయి. దక్షిణ బెంగళూరు కనకపుర రోడ్‌లోని ప్రెస్టిజ్ ఫాల్కన్ సిటీ(పీఎఫ్‌సీ) అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ నీటి వినియోగాన్ని తగ్గించుకోవాలని రెసిడెంట్లను కోరింది. కడిగేందుకు నీరు అవసరం లేని డిస్పోజబుల్(వినియోగించి పడేసేవి) ప్లేట్లు, అదేవిధంగా చేతులు, ముఖం కడుక్కునేందుకు 'వెట్ వైప్స్' వినియోగించడంపై ఆలోచన చేయాలని కోరడం బెంగళూరులో నీటి సంక్షోభానికి తార్కాణంగా నిలుస్తున్నది. పీఎఫ్‌సీ అసోసియేషన్ అధ్యక్షుడు వసంత్ కుమార్ మాట్లాడుతూ ట్యాంకర్ల ద్వారా నీరు అందుతాయా? లేదా? అనే ఆందోళన కూడా ఉన్నదని, అందుకే ప్రత్యామ్నాయాలపై ఆలోచన చేస్తున్నామని పేర్కొన్నారు.

హౌతీల దాడి.. తొలిసారిగా మరణాలు?

దుబాయ్: హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం జరుగుతున్న క్రమంలో హమాస్‌కు మద్దతుగా ఎర్రసముద్రంలో నౌకలపై హౌతీ రెబల్స్ జరుపుతున్న దాడుల్లో తొలిసారిగా మరణాలు సంభవించాయి. గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో బార్బడోస్‌కు చెందిన ట్రూ కాన్ఫిడెన్స్ అనే వాణిజ్య నౌకపై హౌతీలు జరిపిన దాడుల్లో ఇద్దరు మరణించినట్టు సమాచారం. మరో ఆరుగురు గాయపడినట్టు తెలిసింది. నౌకలోని ఇతర సిబ్బంది నౌకను వదిలేసి లైఫ్ బోట్లలో పారిపోయారు. అంతకుముందు తమ నౌకలపై హౌతీలు ప్రయోగించిన డ్రోన్స్, మిస్సైల్స్‌ను యూఎస్ డిస్ట్రాయర్ కూల్చివేసింది.

నిందితుడి సమాచారమిస్తే 10 లక్షల రివార్డు

న్యూఢిల్లీ: బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో ఈ నెల 1న జరిగిన బాంబు పేలుడు ఘటన నిందితుడి